ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 6 ఆగస్టు 2024 | 5



కాకినాడ పోర్టులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో తొలిరోజు తనిఖీలు

కాకినాడ పోర్టులో చెక్‌పోస్టు ఏర్పాటు

- బొంబాయి కాటా వద్ద తొలి చెక్‌పోస్టు
- 24 గంటలూ పీడీఎస్ బియ్యం తనిఖీలు
- పౌరసరఫరాలశాఖ మంత్రి ఆదేశాలతో కార్యరూపం

- మెయిన్‌లో

మారనున్న రహదారుల.. రూపురేఖలు

అడగడుగునా గోతులతో, ఇరుకుగా ఉన్న రహదారుల రూపురేఖలు మారనున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులతోపాటు గ్రామీణ రహదారుల విస్తరణ, టెంపుల్ సర్క్యూట్‌లో భాగంగా పిఠాపురం పాదగయ, సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయాల మధ్య ఎటువంటి అంతరాయాలు లేకుండా నేరుగా వెళ్లేందుకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణం. ఇవన్నీ త్వరలోనే కార్యరూపం దాల్చనున్నాయి. రూ.531కోట్లపై అంచనాలు రూపొందించిన అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు.



నాలుగు లైన్ల రహదారిగా విస్తరించేందుకు ప్రతిపాదించిన పిఠాపురం-సామర్లకోట పట్టణాల మధ్య గల ఆర్అండ్‌బీ రహదారి

- పిఠాపురం-సామర్లకోట రోడ్డు నాలుగులైన్లకు విస్తరణ
- రూ.300కోట్లతో ప్రతిపాదనలు
- పాదగయ, భీమేశ్వరస్వామి ఆలయాల మధ్య టెంపుల్ సర్క్యూట్‌కు తొలి అడుగు
- రూ.190కోట్లతో మరో నాలుగు రహదారుల విస్తరణ, అభివృద్ధి
- ఆర్అండ్‌బీ రోడ్ల అత్యవసర మరమ్మతులకు రూ.41.10కోట్లు
- పిఠాపురంపై పవన్ మార్కు

పిఠాపురం, ఆగస్టు 5: పిఠాపురం నియోజకవర్గంలో పవన్ మార్కు కనిపించడం ప్రారంభమైంది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించి డిప్యూటీ సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి అన్ని శాఖల అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఏళ్ల తరబడి, దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను దుమ్ముదులుపుతున్నారు. తాజాగా అంచనాలు వేస్తున్నారు. ప్రభుత్వ ఆమోదంకోసం పంపుతున్నారు. జిల్లాస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించడంతోపాటు అధికంగా నిధులు అవసరమయ్యే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించడంలో అధికారులు బిజీబిజీగా ఉన్నారు. తాజాగా ఆర్అండ్‌బీ రహదారుల దుస్థితిపై పవన్ దృష్టి సారించారు. అత్యవసరంగా ఏం చేయాలి, మరమ్మతులు, పునర్నిర్మాణ పనులతోపాటు గ్రామీణ ఆర్అండ్‌బీ రహదారుల విస్తరణ, పిఠాపురం పట్టణానికి కలిపే ప్రధాన రహదారులను ఎలా అభివృద్ధి చేయాలన్న అంశంపై నివేదికలు కోరారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు.

పిఠాపురం-సామర్లకోట మధ్య హైస్పీడ్ కనెక్టివిటీ

అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతయిన పురుహూతికాఅమ్మవారు, స్వయంభూగా వెలసిన కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి కొలువై ఉన్న పిఠాపురం పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం, దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒక్కటిగా ఉన్న కుంతీమాధవస్వామి దేవస్థానం సహా పలు పురాతన ఆలయాలు, వివిధ మతాల ప్రార్థనా స్థలాలు కొలువైఉన్న పిఠాపురం పట్టణానికి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తూ ఉంటారు. వీరు రాకపోకలు సాగించేందుకు వీలుగా పిఠాపురాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తానని పవన్‌కల్యాణ్ ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భాగంగా పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని, పంచారామాల్లో ఒకటిగా ఉన్న సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి ఆలయాలను కలుపుతూ టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. ఇందులోభాగంగా పిఠాపురం-సామర్లకోట ఆలయాల మధ్య ప్రస్తుతం ఉన్న ఆర్అండ్‌బీ రహదారిని మరింత విస్తరించాలని ప్రతిపాదించారు. పాదగయ క్షేత్రం నుంచి భీమేశ్వరస్వామి ఆలయం వరకూ ప్రస్తుతం ఉన్న రోడ్డు 7 మీటర్లు నుంచి 10 మీటర్ల వెడల్పున ఉంది. దీంతో 20 మీటర్ల వెడల్పుకు విస్తరించి నాలుగులైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 13కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారిని నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించడంతోపాటు సామర్లకోటలో కాకినాడ రోడ్డువైపు ఉన్న రైల్వేగేటు మీదుగా ఫ్లైఓవర్ (ఆర్వోబీ) నిర్మించనున్నారు. నాలుగులైన్ల రహదారి, ఆర్వోబీ నిర్మాణాలతోపాటు భూసేకరణకు రూ.300కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. వారు వీటిని ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఈ పనులకు ఆమోదం లభిస్తే పిఠాపురం-సామర్లకోట మధ్య నిత్యం ప్రయాణాలు సాగించే కాకినాడ జిల్లా వాసులతోపాటు వివిధ ప్రాంతాలు నుంచి వచ్చే భక్తులకు ప్రయాణం సులభతరంగా మారుతుంది.

గ్రామీణ రహదారులకు విస్తరణ యోగం

ఆర్అండ్‌బీశాఖ పరిధిలో ఉన్న గ్రామీణ రహదారుల విస్తరణపై దృష్టిపెట్టారు. ఇందులోభాగంగా ఎన్‌హెచ్-216 నుంచి తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల మీదుగా ఎన్‌హెచ్-16 వరకూ ఉన్న రోడ్డు సింగిల్‌లైన్ రోడ్డుగా ఉంది. రెండు జాతీయ రహదారులను కలిపే ఈ రోడ్డు మీదుగా వందలాది వాహనాలు నిత్యం ప్రయాణిస్తూ ఉంటాయి. రహదారి ఇరుకుగా ఉండడంతో ప్రయాణాలకు ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ రహదారిని విస్తరించాలని ప్రతిపాదించారు. పిఠాపురం-నేమాం మధ్య గల బీచ్ రహదారి, చేబ్రోలు-మల్లవరం-ఏవీనగరం రోడ్డు, పిఠాపురం-నరసింగపురం-జములపల్లి-గోకివాడ-బి.కొత్తూరు రోడ్డును విస్తరించేందుకు అంచనాలు రూపొందించారు. ఈ నాలుగు ఆర్అండ్‌బీ రోడ్లను విస్తరించి అభివృద్ధి చేసేందుకు రూ.190కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదించారు.

అధ్వాన్న రహదారులకు మరమ్మతులు

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు నియోజకవర్గంలో ఉన్న ఆర్అండ్‌బీ రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయి. భారీ గోతులతో అధ్వానంగా ఉన్న ఈ రోడ్లు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లపై గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టలేదు. దీంతో రహదారులు అడుగడుగునా గోతులతో ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. వీటికి తక్షణం మరమ్మతులు చేపట్టేందుకుగాను రూ.41.10కోట్లు అవసరమవుతాయని అంచనాలు రూపొందించారు. వీటిని ప్రభుత్వ ఆమోదంకోసం పంపారు. ఆర్అండ్‌బీ రహదారులతోపాటు పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ నియోజకవర్గంలో పర్యటించి ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేసి వెళ్లారు.

ఇక దశ తిరిగినట్లే...

పిఠాపురం-సామర్లకోట రహదారి నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించడంతోపాటు ప్రధానమైన ఆర్అండ్‌బీ రహదారుల విస్తరణ పనులు చేపడితే పిఠాపురానికి హైస్పీడు కనెక్టవిటీ ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే 216వ జాతీయరహదారిని విస్తరించి అభివృద్ధి చేయడంతో కాకినాడ-పిఠాపురం-గొల్లప్రోలు-చేబ్రోలు-కత్తిపూడి మధ్య ప్రయాణదూరం బాగా తగ్గింది. విస్తరణ జరిగిన తర్వాత పిఠాపురం-సామర్లకోట మధ్య ప్రయాణ సమయం సగానికి తగ్గుతుందని భావిస్తున్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజా ఫిరాద్యుల పరిష్కార వ్యవస్థకు 461 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 5: కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలనుంచి వచ్చిన అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కోగృహాలు, ఇళ్లస్థలాలు, కాలువల్లో పూడిక తొలగింపు వంటి అంశాలకు చెందిన 461 అర్జీలు అందాయన్నారు. ఈ అర్జీల పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కేఎస్ఈజెడ్ ఎస్డీసీరామలక్ష్మి, డీఎల్డీవో నారాయణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇకపై వ్యవస్థను కరెక్ట్ చేస్తాను






అమరావతిలో జరిగిన రాష్ట్రస్థాయి జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. హాజరైన కలెక్టర్ షణ్మోహన్

- వైసీపీ హయాంలో దొంగ చేతికి తాళాలు ఇచ్చేశారు
- గత అయిదేళ్లలో కాకినాడలో రేషన్ బియ్యం భారీగా రీసైక్లింగ్ జరిగింది
- ద్వారంపూడి కుటుంబంలో మూడు పదవులతో మొత్తం బియ్యం తినేశారు
- కాకినాడలో బియ్యం మాఫియాపై కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ధ్వజం
- ప్రసాద్ స్కీం కింద అన్నవరం దేవస్థానం అభివృద్ధిపై ప్రస్తావన

కాకినాడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ గత ఐదేళ్ల పాలనలో కాకినాడలో భారీగా రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరిగింది. ఇది చాలా దారుణం, కాకినాడలో వైసీపీ నేత కుటుంబంలో మొత్తం మూడు పదవులతో బియ్యం దోచేశారు. ద్వారంపూడి వైసీపీ ఎమ్మెల్యేగా ఉంటే ఆయన సోదరుడు రాష్ట్ర మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన తండ్రి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్. ఈ ముగ్గురు కలిపి మొత్తం బియ్యం రీసైక్లింగ్ చేశారు. ఇందుకు అధికార వ్యవస్థ పూర్తిగా సహకరించింది. ఒకరకంగా చెప్పాలంటే దొంగ చేతికి తాళాలు ఇచ్చేశారు' అంటూ సోమవారం అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పనితీరుపై చర్చ సందర్భంగా సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇకపై ఈ వ్యవస్థను కరెక్ట్ చేస్తానని స్పష్టం చేశారు. సోమవారం అమరావతిలో రాష్ట్రస్థాయి జిల్లా కలెక్టర్ల సదస్సు జరిగింది. ఇందులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పాల్గొన్నారు. సదస్సులో జిల్లాకు సంబంధించి అన్నవరం దేవస్థానం అభివృద్ధి అంశం ప్రస్తావనకు వచ్చింది. ప్రసాద్ స్కీంకు సంబంధించి రూ.25.32కోట్లతో అభివృద్ధి పనులకు సవరించిన డీపీఆర్‌ను కేంద్రానికి పంపించామని అధికారులు సీఎంకు వివరించారు. త్వరలో పనులు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో సీఎం కోర్ డ్యాష్ బోర్డును 60 రోజుల్లో అందుబాటులోకి తెస్తామని అధికారులు వివరించారు. జిల్లాస్థాయిలో ఆర్టీజీ సెంటర్లను కలెక్టర్లు 60 రోజుల్లో సిద్ధం చేయాలని ప్రభుత్వం సూచించింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రాష్ట్ర రోబస్ట్ ఇన్సిడెంట్ సెంటర్ ఆన్‌లైన్ విధానాన్ని జిల్లాలకు అనుసంధానించే విషయమై చర్చ జరిగింది. సదస్సుపై కలెక్టర్ షణ్మోహన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జిల్లాలో జరగాల్సిన అభివృద్ధి గురించి సీఎం అనేక విషయాల్లో దిశానిర్దేశం చేశారని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో నిబంధనల కంటే మానవతా దృక్పథంతో ఎక్కువ ఆలోచించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

పేరుకుపోతున్న.. ఫైళ్లు



- 15 రోజులు గడస్తున్నా విధుల్లో చేరని నూతన జేసీ
- జిల్లా కలెక్టర్‌పైనే అదనపు భారం

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 5: జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమించినప్పటికీ విధుల్లో చేరకపోవడంతో ఫైల్స్ పేరుకుపోతున్నాయి. నియమించి 15 రోజులు గడస్తున్నా విధుల్లో చేరలేదు. దీంతో ఈ బాధ్యతలను జిల్లా కలెక్టర్ అదనంగా స్వీకరించి చేస్తున్నారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆర్.గోవిందరావును గతనెల 20న నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆయన సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సులో రాష్ట్ర కార్యాలయంలో అదనపు సంచాలకుడిగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో బాధ్యతలు స్వీకరించలేదు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రామ్‌సుందర్‌రెడ్డిని అమరావతి బదిలీ చేయడంతో అయన రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. నూతన జేసీ జిల్లాలో బాధ్యతలు తీసుకోకపోవడంతో ఆ బాధ్యతలను కూడా జిల్లా కలెక్టర్ చూస్తున్నారు. జిల్లాలో జేసీ నిత్యావసర సరకుల నియంత్రణ, రేషన్ పంపిణీ, రైతు బజార్ల పర్యవేక్షణ చూస్తారు. పైగా పౌరసరఫరాలశాఖ ద్వారా పంపిణీ చేసే అన్ని సరుకులను పరిశీలిస్తారు. ఇటీవల కాకినాడలో గొడౌన్లలో కెర్నెల్స్ కల్గిన ఫోర్టిఫైడ్ పీడీఎస్ బియ్యం లభించింది. ఈ నేపథ్యంలో 13 బియ్యం గొడౌన్ల యాజమాన్యంపై 6ఏ కేసులతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ 13 గొడౌన్లల్లో గుర్తించిన 26,488 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యానికి సంబంధించిన 6ఏ కేసుల ఫైల్స్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించాల్సి ఉంది. ఈ పీడీఎస్ బియ్యానికి సంబంధించిన యాజమాన్యంపై జరిమానా విధించాలా? లేకపోతే కోర్టు అనుమతి తీసుకుని ఈ పీడీఎస్ బియ్యాన్ని వేలం వేయాలా వంటి అంశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాల్సి ఉంది. పైగా కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు అవుతున్నాయి. దీంతో చెక్‌పోస్టుల అధికారులను నడిపించడంలో జేసీ కీలకపాత్ర పోషించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జేసీ విధుల్లోకి చేరాలని జిల్లావాసులు కోరుతున్నారు.

పాసు పుస్తకాలపై రాజముద్ర



- రెవెన్యూశాఖను ఆదేశించిన సీఎం చంద్రబాబు
- కొత్త పుస్తకాలకు క్యూఆర్ కోడ్
- స్కాన్ చేస్తే ఆస్తి వివరాలు, అడ్రస్
- తన బొమ్మకోసం రూ.15 కోట్లు వృథా చేసిన జగన్

పెద్దాపురం, ఆగస్టు 5: భూయజమానులకు శుభవార్త. త్వరలో కొత్త పాసుపుస్తకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇవ్వబోయే పాసుపుస్తకాలపై రాజముద్రను ముద్రించనున్నారు. ఈ మేరకు రెవెన్యూశాఖ సమీక్షలో ఇటీవల చంద్రబాబు అధికారులకు పలు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కీలకమైన విషయాలపై సీఎం దృష్టిసారించారు. పాసుపుస్తకాలపై జగన్ బొమ్మను ముద్రించి పంపిణీ చేయడంవల్ల ప్రజల్లో అనేక రకాల భయభ్రాంతులు నెలకొన్న సంగతి ఎన్నికల సందర్భంగా బహిర్గతమైంది. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో కూడా చాలామంది రైతులు, భూయజమానులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ ఆస్తుల పత్రాలపై జగన్ బొమ్మలు ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక పాసు పుస్తకాలు మారుస్తామని చంద్రబాబు హామీ కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రచార పిచ్చితో జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా రెవెన్యూశాఖలో తీసుకున్న నిర్ణయాలపై సీఎం సమీక్ష నిర్వహించి కొత్తపుస్తకాలు రాజముద్ర ఉండాలని ఆదేశించారు.

లోన్లు ఇవ్వని బ్యాంకర్లు..

ప్రస్తుతం భూయజమానుల వద్ద ఉన్న పాసుపుస్తకాలపై జగన్‌మోహన్ రెడ్డి బొమ్మను ముద్రించారు. కేవలం ముందుపేజీలో మాత్రమే కాకుండా లోపల ఉన్న ప్రతి పేజీలోను ఆయన బొమ్మలు ఉన్నాయి. ఈ పుస్తకాలు తీసుకుని బ్యాంక్ల వద్దకు వెళ్తే రుణాలు ఇవ్వమని ముఖం మీదే చెప్పేసి రైతులను బ్యాంకులనుంచి బయటకు పంపిన సందర్భాలు ఉన్నాయి. ఇది అన్నిపార్టీల నేతలు, కార్యకర్తలు అభిమానులకు బాగా ఇబ్బందికరంగా అనిపించింది. జగన్ బొమ్మను పాసు పుస్తకాలపై వేయడంవల్ల కొందరు తమకు ఆ పాసు పుస్తకాలు వద్దని తిరిగి ఇచ్చేసి వెళ్లారు. తమ తాతలు, తండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తులపై జగన్ బొమ్మ వేస్తే పాసు పుస్తకాలు ఎందుకు తీసుకుంటామని చాలామంది భూయజమానులు ఎదురుతిరిగారు. గత ఎన్నికల్లో జగన్ ఓటమికి ఇది ఒక కారణంగా కనబడుతోంది.

గతంలో ఎన్నడూ లేదు..

పాసుపుస్తకాలపై 2019కి ముందు ఉన్న ప్రభుత్వాలు సీఎంల ఫొటోలను ముద్రించిన దాఖలాలులేవు. ఏ ప్రభుత్వం ఉన్న రాజముద్రతోనే పాసుపుస్తకాలు పంపిణీ చేసేవారు. జగన్ అధికారంలోకి వచ్చాక భూ యజమానులు అత్యంత భద్రంగా చూసుకునే పాసు పుస్తకాలపై సీఎం ఫొటో ముద్రించారు. అందుకోసం రూ.15కోట్లు వరకూ వృథా చేసినట్లు తెలుస్తోంది.

ఆధునిక హంగులు..

కొత్త పాసు పుస్తకాలు ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. నకిలీవి తయారుచేయడానికి వీలు లేకుండా కొత్త పుస్తకాలకు క్యూఆర్ కోడ్‌ను ఇస్తారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్థి వివరాలు, అడ్రస్ కూడా తెలుస్తాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆస్తి ఉన్న అడ్రస్ వద్దకు తీసుకువెళ్లే మ్యాప్ కూడా వచ్చేలా ఏర్పాటు చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ విధానంవల్ల భూ యజమానుల ఆస్తులకు భద్రత వంటి ప్రయోజనం కలుగుతుంది.

వైసీపీ హయాంలో అడ్డగోలుగా తవ్వకాలు

- చెలరేగిన మట్టి మాఫియా
- పోలవరం, పుష్కర గట్లన్నీ మాయం

గండేపల్లి, ఆగస్టు 5: వైసీపీ ఐదేళ్ల పాలనలో వాళ్లు ఆడిందే ఆట పాడిందే పాట. పోలవరం, పుష్కర గట్లన్నీ కూడా ఇష్టానుసారంగా అడ్డగోలుగా తవ్వేశారు. అధికారులు మాత్రం వారిపై ఏమాత్రం కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు. గ్రామస్తుల ఫిర్యాదుతో మట్టిమాఫియాపై అధికారులు చర్యలు తీసుకుందామనుకున్న బడా నాయకుల నుంచి ఫోన్లు రావడంతో వారి వైపు చూడాలంటే భయపడేవారు. ఇలా వైసీపీ పాలనలో మట్టి మాఫియా గండేపల్లి మండలంలో చెలరేగిపోయి పోలవరం, పుష్కర, చెరువు గట్లను అనుమతి లేకుండా తవ్వేసి భారీ లారీలు, ట్రాక్టర్లపై అక్రమ ఫిల్లింగులు చేసి లక్షల్లో సొమ్ము చేసుకున్నారు. మండలంలోని మురారినుంచి నీలాద్రిరావుపేట వరకు 20కిలోమీటర్ల మేర ఉన్న జాతీయరహదారికి కొద్దిదూరంలోనే పోలవరం, పుష్కర గట్లు ఉన్నాయి. ఇక్కడినుంచి మట్టి తరలించేందుకు అనుకూలంగా ఉండడంతో మట్టిమాఫియా వైసీపీ నాయకులు అండతో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా మట్టిని కొల్లగొట్టి అక్రమ ఫిల్లింగులు చేయడంతో గట్లన్నీ తరిగిపోయాయి. వర్షాలు వస్తే గండికొట్టే పరిస్థితికి చేరుకున్నాయి. మండలంలో మట్టి తవ్వకాలకు అనుకూలంగా ఉండడంతో ఇక్కడినుంచి ఇతర మండలాలకు రాత్రి, పగలు తేడా లేకుండా అదూ్డఅదుపులేకుండా తరలించేశారు. అధికారులు అరకొర చర్యలు మాత్రమే తీసుకున్నారు. కొన్నిచోట్ల జగనన్న కాలనీ పేరు చెప్పి మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆటలు సాగుతాయన్న రీతిలో మట్టి తవ్వకాలకు ప్రయత్నించారు. అయితే అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు రావడంతో మాఫియా వెనుకడుగు వేస్తోంది.



నీలాద్రిరావుపేటలో పోలవరం గట్టును అడ్డగోలుగా తవ్వేసిన దృశ్యం

ఘనంగా ప్రారంభమైన సత్యదేవుడి ఆవిర్భావ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

అన్నవరం, ఆగస్టు 5: రత్నగిరివాసుడైన సత్యదేవుని క్రోధి నామ సంవత్సర 134వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు అనివేటి మండపంలో ప్రత్యేక వేదికపై స్వామి ,అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, జపాలు, మంటపారాధనలు, నవగ్రహ జపాలు, చండీ పారాయణ, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. పండితులకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు.

నేడు సత్య విదియ: స్వామివారు స్వయం భువునిగా 1891 ఖర నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ విదియ రోజున ఆవిర్భవించారు. దీంతో శ్రావణ శుద్ధ విదియను సత్య విదియగా పిలుస్తారు. మంగళవారం వేకువ జామున రెండు గంటలకు సుప్రభాత సేవ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి 10 గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ఊరేగిస్తారు. రాత్రి 7.30 గంటలకు కొండ దిగువన వెండి గరుడ వాహనంపై వివిధ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం జరుగుతుంది.





వేద పండితులకు దీక్షా వస్త్రాలు అందజేసి పూజల్లో పాల్గొన్న చైర్మన్ రోహిత్



మంత్రి సుభాష్ తల్లిదండ్రులతో సంప్రోక్షణ పూజలు చేయిస్తున్న అర్చకస్వాములు

భీమేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు

» రేపటి నుంచి భక్తులకు యథావిధిగా భీమేశ్వరస్వామివారి దర్శనం

ద్రాక్షారామ, ఆగస్టు 5: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనులను కేంద్ర పురావస్తు శాఖ పూర్తి చేసిన నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో సంప్రోక్షణ పూజలు జరిపి బుధవారం ఉదయం 11 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు. సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పరిషత్, కుచ్చత్రయం, మంటపారాధన, రుత్విక్‌వరుణలు, దీక్షాధారణ జరిగాయి. మధ్యాహ్నం కృష్ణయజుర్వేద పారాయణ, గణపతి హోమం, వాస్తు హోమం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు పూజలను జరిపించగా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో పీటీవీ సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్ఆర్‌కే గోపాల్‌బాబు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ నాయకుడు పెంకె సాంబశివరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



'లోవ' హుండీల ఆదాయం
రూ.53.61 లక్షలు

తుని రూరల్, ఆగస్టు 5: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారికి భక్తులు కానుల వర్షం కరిపించారు. ఎన్నడూ లేనంతగా ఆషాఢ మాసం 30 రోజుల్లో అమ్మవారికి రూ.53,61,960 ఆదాయం సమకూరింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ప్రత్యేక అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అధిక ఆదాయం వచ్చిందని ఈవో విశ్వనాథరాజు తెలిపారు.



హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలపై దృష్టి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



రాజమహేంద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, మహిళల హక్కులు, మౌలిక సదుపాయాల కల్పన, వివిధ పథకాలపై ప్రజలను చైతన్యం చేసే దిశలో భాగంగా హైకోర్టు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈనెల 15 లోపుగా క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన మహిళల హక్కులు, వారి ఆరోగ్య పరిరక్షణ, మానసిక రుగ్మతలు, వితంతువుల సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ఆయా జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ, వైద్యారోగ్య శాఖ సమన్వయంతో రహదారి మార్గాలు సరిగాలేని కుగ్రామాల్లో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

భార్యను హత్య చేసిన
భర్త అరెస్టు

ధవళేశ్వం, ఆగస్టు 5: భార్య తలపై రాయితో కొట్టి ఆమె మరణానికి కారణమైన భర్త ధనాల మహేష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీటీఆర్ఐకు చెందిన యర్నాకుల శ్యామల (24), ధవళేశ్వరానికి చెందిన మహేష్ 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ బాబు, పాప ఉన్నారు. బొమ్మూరులోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు పడుతుండడంతో చాలాసార్లు పెద్దలు నచ్చజెప్పి సమస్యను పరిష్కరించారు. శ్యామలపై అనుమానం పెంచుకున్న మహేష్ ఈ నెల 2వ తేదీ రాత్రి ఆమెతో గొడవ పడి సిమెంటు రాయితో తలపై కొట్టి పారిపోయాడు. తలపగిలి రక్తం వస్తుండడంతో చుట్టుపక్కల వారు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి తమ్ముడు మణికంఠ ఫిర్యాదుతో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి సీఐ బి.తులసీధర్ దర్యాప్తు చేపట్టి నిందితుడు మహేష్‌ను బొమ్మూరు టిడ్కో గృహాల వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.





గొల్లప్రోలులో ఆయ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ట్రైలర్‌ను లాంచ్ చేస్తున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్. నిర్మాత బన్నీ వాసు

గొల్లప్రోలులో 'ఆయ్'

సందడిగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్

ఆకట్టుకున్న ట్రైలర్

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా: నిర్మాత బన్నీవాసు

గొల్లప్రోలు, ఆగస్టు 5: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సినిమాల సందడి ప్రారంభమైంది. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కన్వెన్షన్‌లో జీఏ2 పిక్చర్స్ పతాకంపై తెరకెక్కిన 'ఆయ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం జరిగింది. మెగా నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలుగా నార్నే నితిన్, నయన్‌సారిక హీరో, హీరోయిన్లుగా నిర్మితమైన ఈ చిత్రం ట్రైలర్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు లాంచ్ చేశారు. గ్రామీణ వాతావరణంలో అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా వినోదాత్మకంగా చిత్రాన్ని నిర్మించామని, ఈ నెల 15న విడుదలవుతుందని నిర్మాత బన్నీవాసు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు పిఠాపురం హాట్ టాపిక్‌గా మారిందని, అందుకే ఇక్కడ ప్రీ రిలీజ్ ఈవెంట్ చేశామని... సినిమా హిట్ కావడం పక్కా అన్నారు. ట్రైలర్‌ను లాంచ్ చేసిన వర్మ, శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం సినిమా వేడుకలకు వేదిక కావడం ఆనందకరమైన విషయమన్నారు. హీరో, హీరోయిన్లు, ఇతర నటులు స్టెప్పులు వేసి ప్రేక్షకులను అలరించారు. ఆయ్ ... మేం ఫ్రెండ్సండి ట్యాగ్‌లైన్‌తో ఉన్న ఈ సినిమాకు అంజి.కె.మణిపుత్ర దర్శకత్వం వహించారు. విద్యా కొప్పినీడి, అంకిత్, కసిరెడ్డి, ఎం.స్వామి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని 'ఆయ్' సినిమా యూనిట్ సందర్శించింది. చిత్రం విజయవంతం కావాలని కోరుతూ కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు పూజలు చేశారు. నిర్మాత బన్నీ వాసు, హీరో, హీరోయిన్లు నార్నే నితిన్, నయన్‌సారిక తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేసే ప్రేక్షకులను అలరించిన హీరో నితిన్, హీరోయిన్ నయన్‌సారిక

వరద తగ్గింది...
పంటు కదిలింది

అంతర్వేది, ఆగస్టు 5: ఇటీవల వచ్చిన వరదలకు సుమారు పది రోజులకు పైగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి నుంచి నర్సాపురం పంటుపై రాకపోకలకు అంతరాయం కలిగింది. సఖినేటిపల్లిరేవులో వరద ప్రవాహం తగ్గింది. దీంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నట్టు పంటు నిర్వాహకులు తెలిపారు.



పంటుపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

వలకు చిక్కిన 'శీలావతి'

16 కిలోలు రూ.3,200కి విక్రయం

మోతుగూడెం, ఆగస్టు 5: మోతుగూడెం పరిధిలోని మంగంపాడు వద్ద సీలేరు నదిలో బెంగాలీ మత్స్యకారుడు కేనా సోమవారం వేటకు వెళ్లాడు. అతని వలకు శీలావతి జాతికి చెందిన చేప చిక్కింది. 16 కిలోల బరువున్న దీనిని మోతుగూడెం మార్కెట్లో రూ.3,200కు విక్రయించాడు.



ఏపీ మల్లవరంలో ప్రబలిన
విష జ్వరాలు

వంద మందికి పైగా జ్వరపీడితులు... పలువురికి డెంగ్యూగా గుర్తింపు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 5: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరంలో విష జ్వరాలు ప్రబలాయి. గ్రామమంతా జ్వరంతో వణుకుతోంది. పదుల సంఖ్యలో జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగ్యూగా నిర్ధారణ కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

వాతారవరణంలో మార్పుల ప్రభావంతో ఏపీ మల్లవరంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వారంలో సుమారు వంది మందికిపైగా జ్వరం, రొంప, దగ్గు, వంటి నొప్పులతో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యారు. ప్రతి ఇంట్లోనూ కనీసం ఒకరు జ్వరంతో బాధపడటం గానీ, చికిత్స పొంది తేరుకోవడం గానీ జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. జ్వరం రాగానే తీవ్రంగా నీరసం వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. జ్వరం, ఇతర లక్షణాలతో బాధపడుతున్న వారు ప్రైవేటుగా పరీక్షలు చేయించుకున్నారు. డెంగ్యూగా నిర్ధారణ అవుతుండడంతో కాకినాడ, పిఠాపురం ల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాకినాడ సర్పవరం-మాధవపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఏపీ మల్లవరం గ్రామానికి చెందిన 30 మంది డెంగ్యూతో బాధపడుతూ చికిత్స నిమిత్తం చేరారు. వీరిలో కొంతమంది డిశ్చార్జి కాగా ఇంకా 12మంది చికిత్స పొందుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారు ఏపీ నగరం, చేబ్రోలు పీహెచ్‌సీలకు, పిఠాపురం సీహెచ్‌సీకి వస్తున్నారు. పలువురు పిఠాపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం చేరారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి మందులు అందజేస్తున్నారు. అయితే ఇప్పటివరకూ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు.





కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో డెంగ్యూతో చికిత్స పొందుతున్న రాజేశ్వరి, సుధాకర్‌రెడ్డి

అన్న క్యాంటీన్లు సిద్ధం

ఈ నెల 15న తెరుచుకోనున్న 54 క్యాంటీన్లు ... పాతవి 51, కొత్తవి 3

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5: జోన్-2 పరిధిలో 54 అన్న క్యాంటీన్లు ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి రానున్నాయని రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. జోన్-2లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 4, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 5, ఏలూరు పరిధిలో 4, రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 3, భీమవరం పరిధిలో 3, తాడేపల్లిగూడెం పరిధిలో 3, గుడివాడ పరిధిలో 2... వీటితో పాటుగా మరో 23 మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో ఒక్కొక్క అన్న క్యాంటీన్లు ఉన్నాయి. వీటిలో అమలాపురం, జంగారెడ్డిగూడెం, గొల్లప్రోలు ప్రాంతాల్లో మరో మూడు కొత్త క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా జోన్-2 పరిధిలోని 54 క్యాంటీన్లను ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం మూసివేయడంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారిపోయాయన్నారు. క్యాంటీన్లలోని కంప్యూటర్లు, ఫర్నిచర్ కూడా లేకపోవడంతో తిరిగి టీడీపీ ప్రభుత్వం భవనాల రిపేర్ల నిమిత్తం, ఫర్నిచర్, కంప్యూటర్ల కొనుగోలు నిమిత్తం నిధులు కేటాయించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే అన్న క్యాంటీన్లు తిరిగి తెరవడానికి ఏర్పాట్లు చేస్తోందని, క్యాంటీన్ల భవనాలకు మరమ్మతులు చేసి వాటిల్లో సౌకర్యాలు కల్పించేందుకు కోట్లు నిధులు విడుదల చేసిందని ఆర్డీ తెలిపారు. వీటికి ఆహారం సరఫరా చేయడానికి ఇటీవల ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచిందని, మొత్తం ప్రక్రియను వచ్చే నెల మొదటి వారంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. అన్న క్యాంటీన్ల వల్ల పేదవారికి ఉపయోగమే. వ్యాపారస్తులకు, పల్లెల నుంచి పనిమీద నగరాలకు, పట్టణాలకు వచ్చి వెళ్లే వారికి ఇవి చాలా ఉపయోగపడతాయి. బయట టిఫిన్ చేయడానికే రూ.30నుంచి రూ.80 అవుతోంది. రూ.5కే భోజనం అంటే చాలా మంచిది. కూలి పనులు చేసుకునే వారికి, చిన్న వ్యాపారస్తులకు అంతోఇంతో డబ్బులు కూడా ఆదా అవుతాయని నాగనరసింహారావు చెప్పారు.

తూరంగిలో 55.90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కాకినాడ రూరల్, ఆగస్టు 5: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి నుంచి కొవ్వూరు వెళ్లే రోడ్డులో గల శుభం కౌంటీ సమీపంలో మూర్తిగారి లేఅవుట్‌లోని రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 55.90 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని మహేంద్ర లోడ్ కింగ్ ఆప్టిమాలో లోడింగ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మమత తెలిపారు. బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ సీఐ నాగరాజు, వీఆర్వో సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి దాడి చేశారన్నారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.2,54,345 ఉంటుందని కనకాల దుర్గారావు, అనపర్తికి చెందిన కోనాల ఆనందరెడ్డి ఇక్కడ అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వచేసినట్లు గుర్తించామని... స్పాట్‌లో ఉన్న అతని గుమస్తా కాజులూరుకు చెందిన కనకాల దుర్గారావును అదుపులోకి తీసుకుని ఇంద్రపాలెం పోలీసులకు అప్పగించామన్నారు. ఆనందరెడ్డి, దుర్గారావులపై 6(ఎ) కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేశామని తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామన్నారు.



ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎస్ఈగా తిలక్‌కుమార్



తిలక్‌కుమార్‌ను సన్మానిస్తున్న గొట్టిముక్కల అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈగా తిలక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాజమహేంద్రవరంలో డీఈ, ఈఈగా సేవలందించిన తిలక్‌కుమార్ పదోన్నతిపై ఏపీఈపీడీసీఎల్ కార్పొరేషన్ మేనేజరుగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. అటుపై రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రాజమహేంద్రవరం ఎస్ఈగా విధులు నిర్వహించిన టీవీఎస్ఎన్ మూర్తి పదోన్నతిపై సీజీఎంగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఎస్ఈ బాధ్యతలు స్వీకరించిన తిలక్‌కుమార్‌ను సోమవారం జిల్లా విని యోగదారుల మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాజమహేంద్రవరంలో విశేషంగా సేవలందించిన తిలక్‌కుమార్ తిరిగి ఎస్ఈగా రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



నాట్లేసిన ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జడ్డంగి నుంచి రాజవొమ్మంగి వెళ్తుండగా వట్టిగెడ్డ గ్రామ శివారులో రోడ్డు పక్కన పొలాల్లో వరినాట్లు వేస్తున్న రైతులు ఆమె కంటపడ్డారు. వెంటనే ఆమె కారు ఆపి పొలంలోకి దిగి రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. కాసేపు వారితో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా వరి నాట్లు వేశారు.

...రాజవొమ్మంగి

చెరువులకు జలకళ

ప్రత్తిపాడు, ఆగస్టు 5: కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురవడంతో మండలంలోని పెదశంకర్లపూడి వెంకన్నదొరచెరువు, ఒమ్మంగి రాజు చెరువు, ఏలూరు వెంకటపతిరాజు చెరువు, చింతలూరు రామానుజం చెరువులు పొర్లు కట్టడాలు మీదుగా పొంగి ప్రవహిస్తున్నారు. అలాగే ధర్మవరం రామభద్రరావు చెరువు, ప్రత్తిపాడులోని ఊరచెరువు, పుత్ర చెరువు, దేవల పల్లి వారి చెరువు, చినశంకర్లపూడి కుదుముల చెరువుల్లోకి పెద్ద ఎత్తున జలాలు తరలివచ్చి ఈ చెరువులు నిండి నీటితో కళకళలాడుతున్నాయి.

'ఇళ్ల స్థలాల పేరిట కోట్లాది రూపాయిల అవినీతి'

పిఠాపురం, ఆగస్టు 5: ఇళ్ల స్థలాల కోసం భూములు సేకరణ, వాటిని చదును చేసి అభివృద్ధి చేసే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలు కోట్లాది రూపాయిల అవినీతికి పాల్పడ్డారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. పిఠాపురం పట్టణ శివారుల్లో ఇళ్లస్థలాలు పంపిణీ నిమిత్తం సేకరించి, ప్రస్తుతం వర్షపునీటిలో ముంపునకు గురైన భూములను ఆయన సోమవారం పరిశీలించారు. వర్మ మాట్లాడుతూ పిఠాపురంలోని నిరుపేదలకు ఇళ్లస్థలాల కోసం పట్టణ శివారులో 64 ఎకరాల భూమిని సేకరించారని, ఇందులో మాజీ ఎమ్మెల్యే దొరబాబు, మాజీ ఎంపీ వంగా గీత రూ.30కోట్లు మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇళ్లస్థలాల భూసేకరణ, ఫిల్లింగ్ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుందని తెలిపారు. టీడీపీ నాయకులు సకుమళ్ల గంగాధర్, నల్లా శ్రీను, మొల్లి నాగమరిడిరాజు, రాయుడు గణేష్, రాజు తదితరులు ఉన్నారు.

'సోషల్ ఆడిట్ సమగ్రంగా చేపట్టాలి'

కరప, ఆగస్టు 5: మండల గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ విచారణ సమగ్రంగా చేపట్టాలని ఎంపీడీవో కె.అప్పారావు సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరిగిన పనులను క్షుణ్ణంగా విచారించి అవకతవకలను గుర్తించి నివేదికలను రూపొందించాలన్నారు. ఎస్ఆర్‌పీ పి.సింహాద్రి మాట్లాడుతూ మండలంలో రూ.10.38 కోట్ల విలువ చేసే 1,320 పనులు చేయడం జరిగిందని, డీఆర్‌పీల సమక్షంలో ఆడిట్ బృందం సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, మండల ఇంజనీరింగ్ అధికారి గంగ్రేటి శైలజ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సుంకర రాంబాబు, వీవీఎస్ వర్ధన్, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ ఉన్నారు.

'రాష్ట్రాలకు అప్పగించడం శుభపరిణామం'

కాకినాడ సిటీ, ఆగస్టు 5: ఆర్థికంగా, సామాజికంగా మాదిగల వెనుకబాటును సుప్రీంకోర్టు గ్రహించి మాదిగ రిజర్వేషన్ ఏర్పాటును ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడం శుభపరిణామమని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగా సంజయ్ అన్నారు. సోమవారం కాకినాడలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జంగి సుధాకర్ అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించగా సంజయ్ మాట్లాడుతూ ఇప్పటివరకు అన్నదమ్ముల్లా ఉన్న మాల,మాదిగలకు ఈ రిజర్వేషన్ ప్రక్రియ అడ్డుకట్ట కాదన్నారు. జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ వరప్రసాద్, నేతలు తాతపూడి మూర్తి, సవరపు నాగరాజు, పలివెల విజయ్‌కుమార్, మద్దాల రామారావు, దలై శ్రీకాంత్, యాదగిరి పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు మేలు'

కరప, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణతో మాదిగలతో బాటు ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నేత, టీడీపీ ఎస్సీసెల్ జిల్లాఉపాధ్యక్షుడు చాట్ర ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. మండలంలోని అరట్లకట్ట, గొడ్డటిపాలెం, కొరుపల్లి, కూరాడ, కరప, నడకుదురు, పెనుగుదురు, యండమూరు, వేళంగి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తూ ఎస్సీలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఎస్సీసెల్ మండల ప్రధాన కార్యదర్శి సవరపు సత్తిబాబు, కో-కన్వీనర్ పలివెల రమేష్‌బాబు, రాయి చిన్న, ఉందుర్తి ప్రకాశరావు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్న మాలలు'

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 5: రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును దేశం యావత్తూ మాలలు వ్యతిరేకిస్తున్నారని ఆంధ్రా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు అన్నారు. ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద కొండబాబు ఆధ్వర్యంలో సోమవారం నిరసన జరిగింది. జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ హాజరయ్యారు. తాబి బాబ్జీ, జయ్యా రాజేంద్రకుమార్, ఏనుగులపల్లి కృష్ణ, పిల్లి శివకుమార్, లింగం శివప్రసాద్, తంతటి కిరణ్, తాడి బాబ్జీ, ప్రసాద్, బుంగా సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

'సూపరింటెండెంట్ నిరంకుశ వైఖరి విడనాడాలి'

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 5: ఎంఎన్‌వో టెర్మినేషన్‌లో కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి విడనాడాలని డిమాండ్ చేస్తూ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(టీఎన్‌టీయూసీ) ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సబ్బతి ఫణీశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎన్‌వో పిట్టా దుర్గారావు టెర్మినేషన్ విషయంలో సూపరింటెండెంట్ ఏకపక్ష రీతిలో వ్యవహరించారన్నారు. దుర్గారావును తిరిగి విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'పంట నమోదు తప్పనిసరి'

ఏలేశ్వరం, ఆగస్టు 5: ప్రతీ రైతుకు పంట నమోదు తప్పనిసరి మండల వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి తెలిపారు. సోమవారం మండలంలోని పేరవరంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ రైతులు పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం ఈ క్రాఫ్ బుకింగ్ ప్రక్రియను ప్రవేశపెట్టిందని, అందరూ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న ప్రతీ పంటకు ఇన్సూరెన్సు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కర్రి సుబ్బారావు, కర్రి సూర్యప్రకాశరావు, బర్ల అర్జున్, దేగల సత్యనారాయణ, చెరుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల ఉపన్యాసాలు

తొండంగి, ఆగస్టు 5: పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో సోమవారం జంతు,వాణిజ్య శాస్త్రాలకు సంబంధించిన నిష్ణాతులైన అతిథి అధ్యాపకుల ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ యన్ శ్రీనివాస్ కార్డేటా వర్గం సాధారణ లక్షణాలు, వర్గీకరణ అనే అంశంపై ఉపన్యసించారు. కాకినాడ పిఆర్ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ యం వెంకటేశ్వరావు బ్యాంకింగ్ సేవలు రకాలు అనే అంశంపై ఉపన్యసించి విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేశారు. అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ సిబ్బంది సత్కరించారు. డాక్టర్ దివాకర్, పివి కృష్ణారావు తదితరులున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన వాసిరెడ్డి ఏసుదాసు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 5: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు సోమవారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం 47 అసెంబ్లీ, 10 పార్లమెంట్ నియోజకవర్గాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించినట్టు తెలిపారు. పార్టీ పటిష్టతకు పార్టీ పదవి, ప్రభుత్వ పదవుల్లో తన పేరును పరిగణనలోకి తీసుకోవాలని సీఎంను కోరగా నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట, ఆగస్టు 5: 2024-25 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్ మెరిట్ కమ్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షకు మండలంలో 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో వై.శివరామకృష్ణయ్య సోమవారం తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సదుపాయాలు లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులను సెప్టెంబరు 6లోగా పరీక్ష రుసుము చెల్లించి అందజేయాలని, వివరాలకు ఎంఈవో కార్యాలయం వద్ద సంప్రదించాలన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ అదృశ్యంపై కేసు నమోదు

తొండంగి, ఆగస్టు 5: జిఎమ్‌పేట ఇంజనీరింగ్ 1 అసిస్టెంట్ వాకా లలిత(26) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. ఉప్పాడ కొత్తపల్లి మండలం అమరవల్లికి చెందిన లలిత శనివారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు పూర్తి చేసుకుని ఇంటికి బయలు దేరి ఉప్పాడలో దిగి ఇంటికి వెళ్లకుండా ఉప్పాడ నుంచి ఆటోలో కాకినాడ బయలుదేరిందని పోలీసులు తెలిపారు. రాత్రి 7గంటల ప్రాంతంలో పోర్టు రైల్వేస్టేషన్ సమీపంలో ఆటో దిగినట్టు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలిసిందన్నారు. తదుపరి ఆమె సెల్ స్విచ్ఛాఫ్ వస్తోందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గండేపల్లి, ఆగస్టు 5: యువతి అదృశ్యంపై సోమవారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నెల 22న మండలంలోని యల్లమిల్లికి చెందిన తవిటికి మానస అమ లాపురంలో పరీక్ష రాయడానికి వెళ్లి అప్పటి నుంచి తిరిగి ఇంటికిరాలేదు. ఆచూకీ కోసం ఎంత వెతికిన దొరకకపోవడంతో తల్లి లక్ష్మీదుర్గ ఇచ్చిన ఫిర్యాదుపై గండేపల్లి ఏఎస్ఐ బి.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

పెద్దాపురం, ఆగస్టు 5: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం అవగాహనా కార్యక్రమం ఆర్డీవో జె.సీతారామారావు అధ్యర్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.సరిత అధ్యక్షతన నిర్వహించారు. వైద్యులు డాక్టర్ అనూషారాయ్, సత్యవంశీ, నిహారిక, అడ్వకేట్ కేవీ చలం తదితరులు ఉన్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'

జగ్గంపేట, ఆగస్టు 5: జగ్గంపేట మండలం రామవరం గ్రామం హైవే రోడ్డు ప్రక్కన ఉన్న లే అవుట్ వేసిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి కె.సతీష్ డిమాండ్ చేశారు. తక్షణం ప్రభుత్వాధికారులు స్పందించి అక్రమ లే అవుట్‌లో అమ్మకాలు నిలిపివేయాలని కోరారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

సామర్లకోట, ఆగస్టు 5: శ్రావణమాసం మహా పర్వదినాలు పురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు వేదమంత్రోఛ్చారణల మధ్య స్వామివారికి విశేష అభిషేకపూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి బాలాత్రిపురసుందరికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు.

ప్రత్తిపాడు: శ్రావణమాస ప్రారంభం సందర్భంగా రాచపల్లిలోని అపీత కుంచాంబ అరుణాచలేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూల అలంకరణలు చేపట్టి విశిష్ట పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ధర్మవరంలోని రాజరాజేశ్వరి కాశీ విశ్వేశ్వర స్వామి, ఒమ్మంగిలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, అలాగే నందీశ్వర ఆలయాలు వద్ద గల హారతులు, పూజలు నిర్వహించారు.

తునిరూరల్: తపోవనం క్షేత్రంలో శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. పీఠాధిపతులు శ్రీ సచ్చితానంత సరస్వతి స్వామిజీ నేతృత్వంలో శివ సపర్య భవానీ తాండవేశ్వరుడికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాన్ని తపోవన పండితులు చేపట్టారు.

జగ్గంపేట: శ్రావణమాసం పురస్కరించుకుని జగ్గంపేటలో శివాలయంలో రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు, చెరువు గట్టుపై కనకదుర్గమ్మ ఆలయం, గ్రామదేవత రావులమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.





సామర్లకోటలో విశేష అలంకరణలో స్వామివారు, ప్రత్తిపాడు: రాచపల్లి అరుణాచలేశ్వరునికి పంచ హారతి ఇస్తున్న దృశ్యం

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

పిఠాపురం రూరల్, ఆగస్టు 5: ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపడాలని బీజేపీ నాయకులు కోరారు. పిఠాపురం మండలం కందరాడలో అమ్మకు వందనం పేరుతో సోమవారం వారు మొక్కలు నాటారు. మండలాధ్యక్షుడు పిల్లా ముత్యాలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తుమ్మల పద్మజ, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, గండి రామతులసి, ఎంపీటీసీ పిల్లా సునీత, చంద్రిక, సత్యవేణి, తోట ఏడుకొండలు, వాసంశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి సత్యనారాయణ, చిట్టా మధు, పోసిన సత్యనారాయణ తదితరులున్నారు.

కిర్లంపూడి: వీరవరం ఉన్నత పాఠశాల, ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో అమ్మపేరు మీద మొక్కలు నాటారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట వెంకట సర్వారాయుడు ముఖ్యఅతిథిగా హాజరవ్వగా శరకణం రాజబాబు, కంట కాశీవిశ్వనాధం,దొడ్డ అప్పారావు, సత్యనారాయణ ఉన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ

తొండంగి, ఆగస్టు 5: పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో సోమవారం టీడీపీ నేత యనమల రాజేష్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. టీడీపీ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ, మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, కొయ్యారామకేశవ, చొక్కా మహంకాళి, దూలం మురళి, కాలిబోయిన చంద్రరావు, ఎంఈవో షేక్ బాబ్జి, ప్రధానోపాధ్యాయులు సత్యన్నారాయణ,నాగేంద్ర, కొయ్య రామకేశవ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్లను పంపిణీ సర్పంచ్ బెంతుకుర్తిసుశీల అబ్బాయి ప్రారంభించారు. కూటమి నాయకులు బొల్లు కొండబాబు, బొండాడ నారాయణ, బొల్లు వెంకటేశ్వరరావు, బొల్లు వెంకటలక్ష్మి, దాసం శేషారావు, దాట్ల కృష్ణబాబు, అద్దేపల్లి రాజా, హెచ్ఎం కె.చినరామమూర్తి పాల్గొన్నారు.

తునిరూరల్: ఎస్.సూరవరం హైస్కూల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లను ఎస్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి) అందజేశారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

సామర్లకోట, ఆగస్టు 5: తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని మండలంలోని మాధవపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ. ఉషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా ప్రాజెక్ట్ డైరక్టర్ కె.ప్రవీణ హాజరయ్యారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని, చీరలు, జాకెట్లు, పూలు, గాజులు, పసుపు, కుంకుమ తదితర సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో ఉషా, క్రాఫ్ట్ కోఆర్డినేటర్ స్వర్ణలత, చైల్డ్ ప్రొటెక్షన్ పీవో విజయ, సూపర్‌వైజర్లు వీరలక్ష్మి, నిర్మలా కుమారి, చంద్రకళ, కూటమి నాయకులు పెంకే వెంకటేష్, అనుసూరి వెంకటరమణ, విత్తనాల వెంకటరమణ, సర్పంచ్ మేడిశెట్టి సుగుణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొండెవరం శివారు జోగిరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీబాయి, అంగన్‌వాడీ కార్యకర్త, వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థినుల కోసం టాయ్‌లెట్స్

సామర్లకోట, ఆగస్టు 5: పట్టణ పరిధిలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల సౌకర్యార్థం నెస్లే ఇండియా సీఎస్ఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా సుమారు రూ.5 లక్షలతో నిర్మించిన టాయ్‌లెట్స్‌ను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యూ.మీనామాధురికి అప్పగించారు. నెస్లే ఇండియా కార్పొరేట్ ఎఫైర్స్ మానేజరు వసీమ్ అహ్మద్ రిబ్బన్ కత్తిరించి టాయ్‌లెట్స్‌ను ప్రారంభించారు. హెచ్ఎం నెస్లే ఇండియా యాజమాన్యానికి పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, జిల్లా మా నవహక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, దాట్ల శ్రీనివాసు, హనుమంతరావు, పాలిక కుసుమ, చంటిబాబు తదితరులు ఉన్నారు.

స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు

కరప, ఆగస్టు 5: పెనుగుదురులో ఒక మాజీ సర్పంచ్ కోట్లు విలువచేసే ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేశారంటూ గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెనుగుదురు వంతెన వద్ద కేఎంజే కెనాల్‌కు ఆనుకుని ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించారని, తన ఇంటి ముందున్న తూర నెంబర్-1 కెనాల్‌ను మాజీ సర్పంచ్ పూడ్చిపెట్టి చుట్టూ ప్రహరీగోడ ఏర్పాటు చేశారని, అలాగే ఊర్లోకి వెళ్లే రోడ్డులో ఉన్న 20సెంట్ల పంచాయతీ స్థలాన్ని లేఅవుట్‌లో కలిపి విక్రయాలు చేశారని గ్రామస్తులు టి.వీరబాబు, టి.గోవిందరాజులు, ఎం.వీరబాబు, బి.బాబ్జీ, టి.అప్పారావు, టి.లక్ష్మణరావు, బి.శివప్రసాద్ ఫిర్యాదుచేశారు. మండల అధికారులకు ఫిర్యాదుచేసినా వారు పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు తక్షణం విచారణ చేయించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అంతర్వేది, ఆగస్టు 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దర్శనం అనంతరం కాకినాడ వలసపాకలకు చెందిన కోకా పార్వతిప్రమీలశేషకుమారి, కుటుంబ సభ్యులు సోమవారం నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2,25,612 విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి. విజయసారథికి అందించారు. వారికి ఆలయాధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సత్యకిరణ్, అన్నదానం స్వామి, విజయ్ ఉన్నారు.



పేదలకు మెరుగైన వైద్యసేవలందివ్వాలి

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

తాళ్లరేవు, ఆగస్టు 5: పేదలకు మెరుగైన వైద్య సేవలను వైద్యులు అందివ్వాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదేశించారు. సోమవారం తాళ్లరేవు సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీని ప్రకటించి సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించిన ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏ ఇబ్బందులు కలగకుండా, ఏ పరీక్షకు రోగులను బయటకు పంపించకుండా సేవలందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వైద్యులకు సూచనలు, సలహాలిస్తూ పేదలకు సేవలందించాలిగాని రాజకీయాలు చేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి వెంకటరమణ, జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్, జనసేన, బీజేపీ నేతలు పాలొన్నారు.



తాళ్లరేవులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ

తాళ్లరేవు సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కన్వీనర్‌గా డాక్టర్ శిరీష, సభ్యులుగా అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎక్స్‌ఆఫీస్ సభ్యులుగా తాళ్లరేవు జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్ (వైసీపీ), సభ్యులుగా రేళ్ల శ్రీనివాసచక్రవర్తి (టీడీపీ), అత్తిలి బాబూరావు(జనసేన), తాళ్లరేవు ఎంపీడీవో ప్రభాకరరావు, కావూరి సరోజిని (టీడీపీ) పంచాయతీ కార్యదర్శి ఎన్.శంకరనారాయణలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సభ్యులను పలువురు దుశ్శాలువాలతో సత్కరించారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 5: గ్రామీణ ప్రాంతాల్లో సరైన డ్రైనేజీలు, రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయంగా రూ.34 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సోమవారం నేమాం, వలసపాకల, వాకలపూడి గ్రామాల్లో రూ.3.97 కోట్ల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సిమ్మెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఆయన మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరాలైన డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు కల్పించలేని దుస్థితిలో గత ప్రభుత్వం పని చేసిందన్నారు. మత్స్యకార, శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. తొలి విడతలో రూ.8కోట్లు మంజూరుకాగా కాకినాడ రూరల్‌కి రూ.3.97 కోట్లు, కరప మండలానికి రూ.4.02 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. జలజీవన్ మిషన్ నిధులతో ప్రజలకు పూర్తిస్థాయిలో రక్షిత తాగునీరందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మెరుగైన శానిటేషన్, విద్యుద్దీపాలు నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు గ్రామాల్లోకి వచ్చిన నానాజీకి కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులు దాసరి శివ, పోసిన రాము, జీని శ్రీనివాస్, మాదారపు తాతాజీ, రాందేవు సీతయ్యదొర, తాతపూడి రామకృష్ణ, మాతా లక్ష్మణ్, చొక్కా జగన్ పాల్గొన్నారు.

'ప్రతీ సమస్యను సత్వరం పరిష్కరించాలి'

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 5: ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతిఒక్క సమస్యను సత్వరమే పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను కమిషనర్ నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 15మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. అనంతరం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో నేరుగా ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. ఎస్ఈలు పి.సత్యకుమారి, వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయసంచాలకులు టీవీశిరిల్ పాల్గొన్నారు. నగరంలోని ఐదో సర్కిల్ పరిధిలోని మస్తరును కమిషనర్ పరిశీలించారు. ఏటిమొగ వెహికల్ యార్డు, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పాల్గొన్నారు.



కాకినాడలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

పెద్దాపురం: అర్హత కలిగిన ప్రతీ అర్జీకి గ్రీవెన్సులో సత్వర పరిష్కారం లభిస్తుందని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను ఆయా శాఖాధికారులకు సూచిస్తూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ప్రత్తిపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 7న మండల పరిషత్ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తామన్నారు.

'రహదారులను మెరుగుపరిచే చర్యలు'

గండేపల్లి, ఆగస్టు 5: అధ్వాన రహదారులను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. సోమవారం మల్లేపల్లి గ్రామం నుంచి ఎన్టీరాజాపురం వెళ్లే అధ్వాన రహదారిని పరిశీలించారు. రోడ్డు సమస్యలను ఎమ్మెల్యే నెహ్రూ, ఎంపీ తంగెళ్ల శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే రహదారుల పునఃనిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సింగలూరి రామ్‌దీప్, రామకుర్తి నరసింహం, పితాని వీరబాబు, బలిరెడ్డి గణేష్ ఉన్నారు. మల్లేపల్లికి చెందిన జనసేన నాయకుడు బలిరెడ్డి గణేష్ తండ్రి మల్లేశ్వరరావు ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు.



అధ్వానంగా ఉన్న రహదారిని పరిశీలిస్తున్న తుమ్మలపల్లి రమేష్



ర్యాలీ నిర్వహిస్తున్న స్కీమ్ వర్కర్లు

రాజకీయ వేధింపులు ఆపాలి

కాకినాడ సిటీ, ఆగస్టు 5: రాష్ట్రవ్యాప్తంగా స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, రాజకీయ కారణాలతో తొలగించిన ఉద్యోగులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ నగరంలో స్కీమ్ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. కచేరీపేట నుంచి జ్యోతీరావ్ పూలే విగ్రహం వరకు ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి ప్రసంగిస్తూ జిల్లాలోని కొన్ని మండలాల్లో చిరుద్యోగులైన మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు యానిమేటర్లను రాజీనామా చేయాలని రాజకీయ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, ఏపీ అండన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాభవాని మాట్లాడారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ సంఘం నాయకులు, మధ్యాహ్న భోజన పథకం నాయకులున్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పిఠాపురం, ఆగస్టు 5: పట్టణంలో ఈనెల 6,7న సాయంత్రం సమయాల్లో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనరు కనకారావు తెలిపారు. పట్టణానికి తాగునీరందించే కుమారపురం వాటర్‌వర్క్‌లో కరెంటు సర్వీసులకు సంబంధించిన మెయింటెనెన్స్ పనులు నిర్వహించాల్సి ఉందని చెప్పారు. ఈ కారణంగా మంగళ, బుధవారాల్లో సాయంత్రం సమయాల్లో తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించి ఆ 2 రోజుల్లో ఉదయం పూటే రెండుపూటలకు సరిపడా నీటిని పట్టుకోవాలన్నారు. 8న సాయంత్రం యధావిధిగా తాగునీటి సరఫరా ఉంటుందని తెలిపారు.

నేడు పుస్తకావిష్కరణ

పోర్టుసిటీ (కాకినాడ), ఆగస్టు 5: హెల్త్‌అవేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, చారిత్రక పరిశోధకుడు కానూరి బదరీనాధ్ రచించిన భారత స్వాతంత్ర్య సమర చరిత్రలోని కొన్ని చారిత్రక అనుక్రమములు పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్నామని సంస్థ కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ నగర్ చల్లా ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పుస్తకావిష్కరణ చేస్తారని, ముఖ్యఅతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొంటారని తెలిపారు. అశ్విని ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహిస్తారని, సభ సంచాలనకర్తగా సహృదయ సాహితీ అధ్యక్షుడు డాక్టర్ వేదుల శ్రీరామశర్మ వ్యవహరిస్తారని తెలిపారు.

ఏలేశ్వరం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ఏలేశ్వరం, ఆగస్టు 5: తుని నుంచి బదిలీపై ఏలేశ్వరం ఎస్ఐగా వెళ్లిన ఎన్.రామలింగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కోరింగ ఎస్ఐగా సత్యనారాయణ

తాళ్లరేవు, ఆగస్టు 5: కోరింగ పోలీసుస్టేషన్ ఎస్ఐగా పి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తాళ్లరేవు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బుచ్చిబాబును మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

ఉచితంగా బస్‌పాస్‌ల పంపిణీ

కాకినాడ రూరల్, ఆగస్టు 5: రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాలిపేట బాలికల ఉన్నత పాఠశాలలోని 420 మంది విద్యార్థినులకు 10 నెలలకు సరిపడే ఏపీఎస్ఆర్టీసీ బస్‌పాస్‌లను ఉచితంగా సోమవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ కార్యదర్శి జగన్నాధం, కోశాధికారి కళ్యాణి ముఖ్యఅతిథులుగా పాస్‌లను అందజేసినట్టు ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ బాదం బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాపారావు, నాగవేణి, రమణమూర్తి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 5: చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం, రోటరీ బ్లడ్‌బ్యాంక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, కరస్పాండెంట్ అనురాధ ప్రారంభించారు. 90మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరావు, వైరాజశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.సుబ్బారావు తదితరులున్నారు.

నేత్ర వైద్యశిబిరం

తునిరూరల్, ఆగస్టు 5: పట్టణంలో మాజీ కౌన్సిలర్ సిద్దాంతపు సత్తిబాబు ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పాయకరావుపేటకు చెందిన హైమా కంటి ఆసుపత్రి వైద్యులు ప్రసాద్ పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసమైనవారికి ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు చర్యలు చేపడుతున్నట్టు నిర్వాహకులు సత్తిబాబు తెలిపారు.

బస్సు సర్వీసు ప్రారంభం

కిర్లంపూడి, ఆగస్టు 5: ఏలేశ్వరం నుంచి వయా కిర్లంపూడి మండలం సోమవరం మీదుగా జగ్గంపేట మండలంలోని నరేంద్రపట్నం చుట్టుపక్కల రింగ్‌రోడ్డుకు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను సోమవారం ప్రారంభించారు. ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, చదరం చంటిబాబు, బుర్రి సత్తిబాబు, జంపన వెంకటసీతారామచంద్రవర్మ, పాటంశెట్టి మురళీకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రౌతులపూడి, ఆగస్టు 5: ఎ.మల్లవరం పాఠశాల నందు మధ్యాహ్న భోజనం పథకాన్ని సోమవారం టీడీపీ నేతలు పల్లికుమార్, గుడివాడ గురునాథ్ పరిశీలించారు. రైస్, సాంబారు బాగోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెండపూడి ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్‌చేసి భోజనం అధ్వానంగా ఉంటుందని తీరు మార్చుకుని మంచి భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను అందజేశారు.

'రహదారులు నిర్మిస్తాం'

గండేపల్లి, ఆగస్టు 5: గ్రామాల్లో రహదారులన్నీ పునఃనిర్మించేందుకు రూ.17కోట్లు నిధుల మంజూరుకు సిద్ధంగా ఉన్నాయని టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు అన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో రోడ్లు పునఃనిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఎమ్మార్పీఎస్ ధర్నా

సామర్లకోట, ఆగస్టు 5: పెద్దబ్రహ్మదేవలో దళిత యువకుడిపై దాడిచేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొండేపూడి శ్యాంబాబు నేతృత్వంలో పెదబ్రహ్మదేవం గ్రామస్తులతో సామర్లకోట తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. డీఎస్పీ కె. లతాకుమారి హామీ మేరకు నిరసన విరమించారు. కాళ్ళ లక్ష్మీ నారాయణ, కాపవరపు కుమార్, మిరియాల సాగర్ ఉన్నారు.